త్వరితగతిన ధ్రువీకరణ పత్రాల జారీ

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్
- జగనన్న సురక్ష ప్రారంభం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 14వ డివిజన్లో గల అద్దాల మందిరం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ప్రజలకు ధ్రువీకరణ పత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో నెలల తరబడి తిరగాల్సి వచ్చేదని చెప్పారు. ప్రస్తుతం సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. నగరంలో దాదాపు 6350కుపైగా ధ్రువీకరణ పత్రాలు జారీ కాగా, ఇందులో 13, 14వ డివిజన్లలో 3384 మంది పొందుతున్నారని వివరించారు. కొందరు అర్హులకు సంక్షేమ పథకాలు అందడంలేదని, పరిశీలించి వారికీ వర్తించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కమిషనర్ వికాస్ మర్మత్, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, ఊటుకూరు నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 52వ డివిజన్ రంగనాయకులపేటలో గల శ్రీకళ అపార్ట్‌మెంట్స్ వద్ద రూ.45 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు.. 16వ డివిజన్ ఆదిత్య కళాశాల వద్ద రూ.50 లక్షలతో చేపట్టిన స్మార్ట్ స్ట్రీట్లకు శంకుస్థాపనను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగనాయకులపేటలోని ముస్లిం శ్మశాన వాటికలో పనులకు రూ.50 లక్షలతో టెండర్లను పిలిచారని చెప్పారు. చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులో రూ.50 లక్షలతో సీటింగ్ ఏరియా, పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా స్మార్ట్ రోడ్డును నిర్మించాలనే ఉద్దేశంతో శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ నాలుగేళ్లు ఎక్కడికీ వెళ్లలేదని.. హైదరాబాద్ సెంట్రల్ ఆఫీస్‌లో ఉన్నానని టీడీపీ సమావేశంలో నారాయణ ప్రకటించారని, అయితే ఆయనకు ఓట్లు వేసింది నెల్లూరు నగర ప్రజలని గుర్తుచేశారు. వరదలొచ్చిన సమయంలో ప్రజలను ఆయన పరామర్శించలేదని, పైగా హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పడం విడ్డూరమని విమర్శించారు. ఫీజులను అధికంగా పెంచి విద్యార్థులపై భారం మోపి.. ఆ డబ్బును ఎన్నికల్లో పెట్టారని ఆరోపించారు. పదవుల కోసం కాదు.. కార్యకర్తలకు అండగా ఉంటానని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అస్మ, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.65 కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులు



సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తమ ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో నగరంలో రూ.65 కోట్లతో నూతన సబ్‌స్టేషన్లు, స్తంభాలు, లైన్లను ఏర్పాటు చేశామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 54వ డివిజన్లోని భగత్‌సింగ్‌కాలనీలో గల జగనన్న లేఅవుట్లో రూ.4.5 కోట్లతో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద కంటైనర్ సబ్‌స్టేషన్‌ను రూ.ఆరు కోట్లతో త్వరలో నిర్మించనున్నారని వెల్లడించారు. అసలు అభివృద్ధి కనిపించడం లేదని ప్రతిపక్షాలు వ్యాఖ్యానిస్తుండటం హాస్యాస్పదమన్నారు. జగనన్న లేఅవుట్, బోడిగాడితోటలో నిర్మించనున్న సబ్‌స్టేషన్లు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు ఉండదని చెప్పారు. కార్పొరేటర్లు సఫియాబేగం, దేవరకొండ సుజాత, ఓబిలి రవిచంద్ర, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వేదాయపాళెం): గుంటూరు జిల్లాలోని కాజా టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం ములాయంసింగ్ యాదవ్ విగ్రహావిష్కరణకు తరలిరావాలని అఖిల భారత యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు బొమ్మి నాగకిశోర్‌యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ముత్తుకూరు రోడ్డులోని హోటల్ రాధే గెస్ట్ ఇన్ సమావేశ మందిరంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్న కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ హాజరుకానున్నారని తెలిపారు. తొలుత అఖిలేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్‌ను కట్ చేశారు. బీసీ నేతలు దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, ఆనంగి రమణయ్య, గంగుల మధుసూదన్, ఎస్సెస్ యాదవ్, కొల్లు మధుబాబు, చిల్లూరు వెంకటరమణయ్య, సోమ గోపాల్, వాసు ముదిరాజ్, విజయమ్మ, కందల బాలకృష్ణ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. గ్రామంలోని పలు ప్రాంతాల మీదుగా రథోత్సవం సాగింది. అనంతరం అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా తుమ్మగుంట వెంకటరమణయ్య, విమలమ్మ.. తుమ్మగుంట శ్రీకాంత్, కీర్తి.. బాలకవి మురళీకృష్ణచైతన్య, సాహితి.. వెంకటసురేంద్ర దంపతులు వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

స్థలాన్ని ఆక్రమించి ఆపై దౌర్జన్యం

నెల్లూరు రూరల్: తన స్థలాన్ని కొందరు ఆక్రమించి అడ్డొచ్చిన వారిపై దౌర్జన్యాలు చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఇందుకూరుపేట మండలం మైపాడుకు చెందిన వెంకటకృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

మెట్ల నుంచి పడి బాలిక మృతి

నెల్లూరు(క్రైమ్): మెట్లను శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడటంతో బాలిక మృతి చెందిన ఘటన మాగుంట లేఅవుట్లోని పావని ట్రిడెంట్ అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులు తన భార్య, తల్లి, కుమార్తె సరిత (17)తో కలిసి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరాన్ని సరిత చదువుతోంది. గత నెల 30న మొదటి అంతస్తులో మెట్లను శుభ్రపరుస్తూ ప్రమాదవశాత్తూ కిందపడి బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లారు. విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు బాలికను చికిత్స నిమిత్తం మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌతమ బుద్ధుడు వాకర్స్ కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో గౌతమ బుద్ధుడు వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప పేర్కొన్నారు. గౌరవాధ్యక్షులుగా మన్నెం శ్రీనివాసులురెడ్డి, రాచపాళెం రఘు, మురారిశెట్టి నరసింహారావు, ఉపాధ్యక్షులుగా ప్రసాద్‌రావు, వెంకటేశ్వరరావు, కుమార్, కార్యదర్శిగా రమణయ్య, సహాయ కార్యదర్శులుగా చెరుకూరి దయాకర్, సురేష్, కామేశ్వరరావు, కోశాధికారిగా నరాల పల్లవి, తదితరులు ఎన్నికయ్యారు. వైద్యులు రమణయ్య, సుబ్బారెడ్డి, కేఎస్ రాజు, ప్రీతమ్, కిషోర్, గంగాధర్, హజరత్‌కుమార్, కొలపర్తి హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వరపురానికి చెందిన వైద్యులు ప్రసాద్, శివప్రసాద్‌ను దివ్యాంగుల ఐక్య సంఘ నేతలు శనివారం సత్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, శ్రీనివాసులు, అలియా, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

- మూలాపేటలోని జిల్లా ఆయుష్ ఆస్పత్రిలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయుష్ అధికారులు గోవిందయ్య, సుధారాణిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వరపరివార్ సేవా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవి, ఆయుష్ సిబ్బంది గౌరీశంకర్, సుకన్య, సందీప్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని కిసాన్‌నగర్, రామచంద్రాపురం ప్రాంతాల్లో ఎలాంటి ఆధారం లేని మూడు పేద వృద్ధ కుటుంబాలకు నగదును అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. రమణమ్మ, దాట్ల వెంకటరెడ్డి కుటుంబాల సహకారంతో రూ.మూడు వేల చొప్పున అందజేశామని ఫౌండేషన్ నేత రమేష్ పేర్కొన్నారు. రవికిరణ్, కార్తికేయ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలో గల కాంప్లెక్స్ రోడ్డు ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశేఖరపురం, ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, కాంప్లెక్స్ రోడ్డు, బృందావనం, పొగతోట, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

‘ఎన్నికల తర్వాత పత్తా లేని నారాయణ’

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గత ఎన్నికల అనంతరం టీడీపీ నేత నారాయణ పత్తా లేకుండా పోయారని, ఇప్పుడు ఆయన్ను పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించగానే నానా యాగీ చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సమీర్ ఖాన్ విమర్శించారు. జెండావీధిలోని డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. హాస్పిటల్ ఉండి కూడా కరోనా సమయంలో వైద్యసేవలను అందించలేని నారాయణ.. డబ్బులతో ఎన్నికల్లో ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. సిమెంట్ రోడ్లపై మళ్లీ రోడ్లు వేసి ప్రజాసేవ చేశామంటే సరిపోతుందా అని పేర్కొన్నారు. రాష్ట్రంలో జగనన్నకు.. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో అనిల్‌కుమార్, ఆదాల ప్రభాకర్‌రెడ్డికి తప్ప ముస్లింలు ఎవరికీ మద్దతివ్వరని స్పష్టం చేశారు.

విద్యుత్ ఆదాపై కార్యాచరణ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ ఆదాకు చర్యలు చేపట్టనున్నామని డీఆర్వో వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో విలేకరులతో శనివారం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ ఆదాపై దృష్టి సారించాలని, దీనికి గానూ కార్యాలయాల్లో పనిచేసే ఓ వ్యక్తికి బాధ్యతలను అప్పగించనున్నామని తెలిపారు. విద్యుత్ ఆదా కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేస్తున్నామని వివరించారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం నేడు

నెల్లూరు(వేదాయపాళెం): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన అగ్నికుల క్షత్రియ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను మూలాపేటలోని వీరశైవ సత్రంలో ఆదివారం ఉదయం పది గంటలకు అందజేయనున్నామని అగ్నికుల క్షత్రియ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరువత్తూరు శివశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 90 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేయనున్నామని వివరించారు. విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీ వేమిరెడ్డి విరాళం

నెల్లూరు(దర్గామిట్ట): బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాలలో శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.ఐదు లక్షలను వీపీఆర్ ఫౌండేషన్ ప్రతినిధుల ద్వారా రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం అందజేశారు. శ్మశాన వాటిక అభివృద్ధి పనుల కోసం ఎంపీకి ఇటీవల గ్రామస్తులు విన్నవించారు. ఈ క్రమంలో నిధులను అందజేశారు. హరిప్రసాద్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపూర్ణిమ మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాలను ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరం నుంచి శ్రీరామచంద్రుడు సాయిదర్బార్ అద్దాల మందిరానికి ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు విచ్చేయనున్నారని చెప్పారు. అనంతరం విష్వక్సేనుల పూజ, కలశస్థాపన, దీపప్రజ్వలన, ప్రత్యేక భజనలు, అన్నప్రసాద వితరణను నిర్వహించనున్నామని చెప్పారు. గురుపూర్ణిమ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నామన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

‘జగనన్న సురక్ష’తో ఎంతో మేలు



కోదూరుపాడులో..



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న విజయలక్ష్మి

నెల్లూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎంతో మేలు చేకూరుతుందని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఒకటో డివిజన్లోని కోడూరుపాడు కల్తీ కాలనీ సమీపంలో లబ్ధిదారులతో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్లోని పలు ప్రాంతాల్లో ఉచిత సేవలను అందించడంతో పాటు 1600 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశామని వివరించారు. తొలుత కార్యక్రమాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, లేబూరు పరమేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్, నేతలు హరిబాబుయాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, ఏసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన

నెల్లూరు(బారకాసు): రూరల్ పరిధిలోని 38, 41వ డివిజన్ల ప్రజల కోసం బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 41వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి మాట్లాడారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చేందుకు ప్రజలు ఇబ్బంది పడకుండా ఆటో సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పార్టీ 38వ డివిజన్ ఇన్‌చార్జి దాసరి రాజేష్, నేత బాబ్జీ, సచివాలయ కన్వీనర్లు సుతారం సురేష్, కురిచేటి వీరాచారి, ఏడుకొండలు, గోపీ, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

5412 మందికి ధ్రువీకరణ పత్రాల మంజూరు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని 19 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి 5412 అర్జీలు అందగా, వీరందరికీ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జగనన్న సురక్ష శిబిరాల్లో ఆధార్ అప్‌డేట్ సెంటర్, మెడికల్ క్యాంపులు, తదితరాలను నిర్వహించారు.

ప్రజాసేవలో వైద్యుల పాత్ర కీలకం



రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో..



నారాయణ హాస్పిటల్లో..



కిమ్స్ హాస్పిటల్లో..

నెల్లూరు(బారకాసు): ప్రజలకు సేవ చేస్తున్న వారిలో వైద్యుల పాత్ర కీలకమని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు రోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కేన్సర్ ఆస్పత్రిలో డాక్టర్స్ డేను శనివారం నిర్వహించారు. అనంతరం వైద్యులను సత్కరించారు. హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, డాక్టర్లు రమేష్‌బాబు, హరితరాణి, పేషెంట్ కౌన్సెలర్ కన్యాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ వైద్యులకు మెడికల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను నగరంలోని నారాయణ హాస్పిటల్లో నిర్వహించారు. వైద్య రంగంలో అవలంబిస్తున్న అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను సత్కరించారు. ఎమర్జెన్సీ విభాగ వైద్యుడు రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.
- డాక్టర్ బీసీ రాయ్ స్ఫూర్తితో వైద్యులు పని చేయాలని గైనకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర పేర్కొన్నారు. పొగతోట, బృందావనంలోని పలువురు వైద్యులను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ) ఆధ్వర్యంలో సత్కరించారు. పీఎంపీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా నేతలు వేణుగోపాల్, శేషయ్య, వీరయ్య, శ్రీనివాసులు, రామదాసు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని కిమ్స్ హాస్పిటల్లో డాక్టర్స్ డేను నిర్వహించారు. అనంతరం పలువురు వైద్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ ఏవీ రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ శివమాల, గైనకాలజిస్ట్ లక్ష్మీదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

31 వరకు డెంగీ నివారణ మాసోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెంచలయ్య, తదితరులు

నెల్లూరు(బారకాసు): డెంగీ నివారణ మాసోత్సవాలను ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. లార్వా, ఫీవర్ సర్వేలను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. అవగాహన ర్యాలీలు, సదస్సులను నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పోస్టర్లు, బ్యానర్లను ప్రదర్శించాలని చెప్పారు. జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ, సహాయ మలేరియాధికారి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించరూ..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తమ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ కార్మిక సంఘాల జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు భగత్‌సింగ్ కాలనీలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. జేఏసీ నేతలు సుమన్, కృష్ణ, ఆరిఫ్, నవీన్, అశోక్, శ్రీనివాసులు, మనోజ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అనిల్ విజయం తథ్యం

నెల్లూరు రూరల్: నెల్లూరు నగర ఎమ్మెల్యేగా అనిల్‌కుమార్ మరోసారి గెలుపొందడం ఖాయమని రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆసిఫాబాబా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాలను ఆయన అభివృద్ధి చేశారని కొనియాడారు. టీడీపీ నేత నారాయణ ఓటమి ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ముస్లింలు తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు.

సహకార శాఖ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సుధాభారతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార శాఖ బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని డీసీఓ సుధాభారతి పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ప్రాంగణంలోని నూతన డీసీఓ కార్యాలయంలో సహకార శాఖ పతాకాన్ని శనివారం ఆవిష్కరించారు. జిల్లా సహకార శాఖ అడిట్ అధికారి తిరుపతయ్య, కావలి డీఎల్‌ఓ తిరుపాల్‌రెడ్డి, సహకార విద్యాధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయులుకు ఘన నివాళి



నెల్లూరు(మినీబైపాస్): ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర గౌరవ సలహాదారుడు అంబటి ఆంజనేయులుకు నివాళులర్పించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయన మృతి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా సంఘ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు దయాశంకర్, వెంకటసుబ్బయ్య, కోశాధికారి హనోక్, తదితరులు పాల్గొన్నారు.

కవి, పండిత సత్కార సభ రేపు



నెల్లూరు(మినీబైపాస్): కవి, పండితోపన్యాసకుడు అలూరు శిరోమణిశర్మ జన్మదినాన్ని పురస్కరించుకొని కవి, పండిత సత్కార సభను సోమవారం నిర్వహించనున్నామని పంచాక్షరి బ్రాహ్మణ జాగృతి సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సింగరాజు భవానీప్రసాద్‌రావు, నారాయణమూర్తి మాట్లాడారు. సుజాతమ్మ కాలనీలోని కురువాడ సత్యనారాయణ కల్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమంలో 72 మంది కవి, పండితులను సత్కరించనున్నామని చెప్పారు. సభ్యులు మైపాడు రాజా, గాయత్రి, గండవరం శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



నెల్లూరు(మినీబైపాస్): యానాదుల సమస్యలను పరిష్కరించాలని యానాది మహానాడు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇండ్ల రవి కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కొమరగిరి మహేంద్రబాబు, ఏకుల సుధీర్, జయలక్ష్మి, మురళి, మాధవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గమ్మ



నెల్లూరు(బృందావనం): పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో కొలువైన దుర్గమ్మకు శాకంబరి అలంకారాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీభాగవతం, పారాయణం, భజనలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆశ్రమ సేవకుడు ధన్వి శ్రీనివాస్, అర్చక పురోహితుడు మువ్వా ప్రసాద్, మహంకాళి వెంకటేష్, కృష్ణవేణి, భువన్, వెంకటేశ్వరనాయుడు, లక్ష్మి, పద్మజ, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ గోదాముల ఏర్పాటుకు కార్యాచరణ

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు నియోజకవర్గంలో రైతుల సౌకర్యార్థం మల్టీ పర్పస్ గోదాముల ఏర్పాటుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఈ క్రమంలో నగరంలోని ఎమ్మెల్యే మేకపాటి క్యాంప్ కార్యాలయంలో మార్కెటింగ్ ఏడీ అనితాకుమారి, డీఈ నారాయణ, ఉద్యాన శాఖ అధికారి లక్ష్మి, ఆత్మకూరు ఏఎంసీ సెక్రటరీ కృష్ణప్రసాద్, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మల్టీ పర్పస్ గోదాముల ఏర్పాటుతో పాటు అనంతసాగరం మండలంలో మిర్చి యార్డును ఏర్పాటు చేయనున్నారని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్లు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, బొర్రా సుబ్బిరెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కో ఆర్డినేటర్ మల్లికార్జునరెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా వైస్ చైర్మన్ షౌకత్ అలీ, నేతలు వినయ్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

8న భవ్యహాసిని నృత్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో చిన్నారి భవ్యహాసిని నాలుగు గంటల నిర్విరామ నృత్య ప్రదర్శనను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకుల పర్యవేక్షణలో ఈ నెల ఎనిమిదిన నిర్వహించనుందని స్కాలర్ స్కాలర్స్ స్కూల్ కరస్పాండెంట్ పద్మజారెడ్డి, కళాదీప్తి నృత్య సంస్థల డైరెక్టర్ కామాక్షి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శ్రీహరినగర్‌లోని స్కాలర్ స్కాలర్స్ స్కూల్లో విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుడి సన్నిధిలో ఈ నెల 16న 14 కిలోమీటర్ల మేర ఐదు గంటలకుపైగా నిర్విరామ నృత్య ప్రదర్శనను భవ్యహాసిని నిర్వహించనుందని చెప్పారు. చెంచులక్ష్మి, నిశ్చిత, రేష్మ పాల్గొన్నారు.